క్లుప్తంగా

మత సామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం: రంజాన్ పురస్కరించుకుని నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యాలకు ప్రతీకలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని పెద్ద మసీదులో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి వేణు పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు సత్తి శంకర్‌రెడ్డి, దార్ల శ్రీను, పెంట పాటి శ్రీను, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుల సంతోషానికి చిరునామా వైఎస్సార్ సీపీ

రామచంద్రపురం రూరల్: వృద్ధుల కళ్లల్లో సంతోషానికి చిరునామాగా వైఎస్సార్ సీపీ ఆదరణ పొందుతోందని కందులపాలెం ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి అన్నారు. గ్రామంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఆమె జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఇంటికి వచ్చి పింఛను అందించే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే అని ప్రజలు తమ పూర్తి మద్దతు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు పెంకే వీర్రాఘవులు, వెంటపల్లి శేషారావు, నాయకులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

రామచంద్రపురం: పట్టణంలోని కూరగాయల మార్కెట్లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పట్టణ తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఏటా స్వామికి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. కల్యాణం అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

కపిలేశ్వరపురం: టేకిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్, భార్గవ్‌ల పర్యవేక్షణలోని వేద పండితులు స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామంతోపాటు సమీప గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

నేడు 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన

మండపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఏడిదలో సంఘం శరణం గచ్ఛామి నాటికను ప్రదర్శించనున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లూరి రామకృష్ణ తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన ఈ కళారూపాన్ని అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శిస్తారన్నారు. గ్రామంలోని సంత మార్కెట్ వద్ద బుధవారం సాయంత్రం ఆరు గంటలకు జరిగే ప్రదర్శనను అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తిలకించాలని రామకృష్ణ కోరారు.

ఘనంగా గొల్లాలమ్మ జాతర

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో బుట్టబొమ్మలు, కేరళ బాజాలు, కోయడాన్సులు, బ్యాండ్‌మేళాలతో పాటు పలు సాంస్కృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఆలయంలోని అమ్మవారితో పాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర అనంతరం నేడు తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

డ్రైన్ నిర్మాణం ప్రారంభం

కె.గంగవరం: మండలంలోని కుదుపూరులో డ్రైన్ నిర్మాణాన్ని మంగళవారం సర్పంచ్ పిల్లి రాంబాబు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలో మురుగునీరు డ్రైన్ ద్వారా మంచినీటి చెరువులోకి వెళ్లకుండా రివర్స్ డ్రైన్ నిర్మించాలని గ్రామస్తులు సర్పంచ్ విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి సర్పంచ్ రాంబాబు పంచాయితీ నిధులతో డ్రైన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. నిర్మాణం నాణ్యతగా జరగాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

రాయవరం: పరస్పర ఫిర్యాదులపై మంగళవారం కేసులు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పసలపూడికి చెందిన గంటి గంగరాజు మరో పది మంది గొడవ పడ్డారు. గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన శివలక్ష్మిని కొట్టి గాయపరచగా, ఆమె రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఘంటా పూర్ణచంద్ర ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశామన్నారు. దండంగి శివలక్ష్మి మరో పది మంది గొడవపడుతుండగా పూర్ణచంద్ర అడ్డు వెళ్లగా ఆమెను కొట్టి గాయపరిచారన్నారు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మసీదు స్థల వివాదం పరిష్కారం

- దారి ఇచ్చేందుకు అంగీకరించిన స్థల యజమానులు
- ఉభయ వర్గాలతో చర్చలు జరిపిన ఎమ్మెల్సీ తోట
- కృతజ్ఞతలు తెలిపిన మసీదు పెద్దలు



మసీదు పెద్దలు, స్థల యజమానులు, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పట్టణంలోని పెద్ద మసీదు స్థల వివాదం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో పరిష్కారమైంది. మసీదుకు గిఫ్ట్‌గా మార్గం ఇచ్చేందుకు స్థల యజమానులు అంగీకారం తెలపగా అందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు మసీదు పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కలువ పువ్వు సెంటర్‌లోని పెద్ద మసీదును ఆనుకుని ఉన్న పాత భవనాన్ని తొలగించి స్థల యజమానులు కొత్త భవన నిర్మాణం చేపట్టారు. కాగా మసీదుకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని ఆరోపిస్తూ మసీదు కమిటీ సభ్యులు వక్ఫ్ బోర్డును ఆశ్రయించారు. తమ సొంత స్థలంలోనే నిర్మాణం చేసుకుంటున్నామని స్థల యజమానుల బదులిచ్చారు. రెండు వర్గాల వాదనల నడుమ నెల రోజులుగా పట్టణంలో వివాదం నెలకొన్న విషయం విదితమే. సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించే దిశగా ఎమ్మెల్సీ తోట ఇప్పటికే అధికారులతో భవన నిర్మాణ పనులు నిలుపుదల చేయించారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా స్థల వివరాలు అందజేయాలని మున్సిపల్, రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారులను ఆయన ఆదేశించారు.

సమసిన వివాదం

మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మసీదు కమిటీ సభ్యులు, స్థల యజమానులతో మంగళవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశం అయ్యారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, సీఐ పి.శివగణేష్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీర్ ఉల్లా, టౌన్‌ప్లానింగ్ అధికారులు హాజరయ్యారు. వివాద స్థలం వివరాలను కమిషనర్ రామ్‌కుమార్ వివరించారు. 50 ఏళ్లకు పూర్వం వివాద స్థలానికి రికార్డు ఏమీ లేదని, ఈ స్థలంపై పట్టా పొందిన అబీ మునీషా 1975లో విక్రయించగా, తొలిసారిగా డాక్యుమెంటు రాయించుకున్నారన్నారు. తర్వాత 1985లో ఒకసారి, 1993లో ఒకసారి ఈ స్థలం చేతులు మారి రిజిస్ట్రేషన్ అయ్యిందని, 1993లో ప్రస్తుత స్థల యజమాని జొన్నల వెంకటేశ్వరరావు కొనుగోలు చేశారన్నారు. ఈ స్థలం మున్సిపాల్టీకి చెందిందని భావించి 2015లో మున్సిపాల్టీ కోర్టులో కేసు వేసి సరైన ఆధారాలు చూపించలేకపోవడంతో 2018లో స్థలం వెంకటేశ్వరరావుకు చెందినదిగా కోర్టు తుది తీర్పు ఇచ్చిందన్నారు. 1932 సంవత్సరపు రికార్డుల్లో మెయిన్ రోడ్డుపై మసీదుకు 123.5 అడుగుల స్థలం ఉన్నట్టు నమోదై ఉండగా ప్రస్తుతం మసీదు షాపులు 129 అడుగులు వరకు ఉన్నట్టు గుర్తించామని కమిషనర్ రామ్‌కుమార్ వివరించారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌ను షఫీర్ ఉల్లా మాట్లాడుతూ మసీదు ఆధీనంలో 50 సెంట్ల స్థలం ఉండగా ప్రస్తుతం తమ వద్ద 35 సెంట్లకు మాత్రమే రికార్డులు ఉన్నాయని వివరించారు. రికార్డులు, కోర్టు తీర్పు ప్రకారం వివాద స్థలం స్థల యజమానులకు చెందినదిగా గుర్తించారు. దీంతో మసీదు కమిటీ పెద్దలు అల్తాఫ్, కరీం, రబ్బానీ, ఆలీఖాన్‌బాబా తదితరులు మాట్లాడుతూ గతంలో మసీదుకు మెయిన్ రోడ్డు నుంచి చిన్న దారి ఉండేదని, మూసుకుపోయిన ఆ దారిని పునరుద్ధరించుకునేందుకు సాయం చేయాలని ఎమ్మెల్సీ తోటను కోరారు. ఈ విషయమై ఎమ్మెల్సీ తోట స్థల యజమానులతో మాట్లాడి మసీదుకు గిఫ్ట్‌గా 2.6 అడుగుల దారి మార్గం ఇచ్చేందుకు వారిని అంగీకరింపజేశారు.

ఆజ్యం పోయాలని రాబందులు చూశాయి

స్థల వివాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని కొన్ని శక్తులు ప్రయత్నించాయని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. ఏ మాత్రం కొంత మంట రాజుకున్నా పెట్రోల్ పోసి పెద్దది చేయాలని రాబందుల్లా కాచుకుని కూర్చున్నారన్నారు. అటువంటి వారికి ఆస్కారం లేకుండా మీడియా, పెద్దలు, అధికారుల సమక్షంలో సమస్యను పారదర్శకంగా పరిష్కరించామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. మసీదు కమిటీ సభ్యులు అల్తాఫ్, కరీంలు మాట్లాడుతూ మసీదుకు దారి మార్గం చూపించి సమస్యను పరిష్కరించడం పట్ల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, జిన్నూరి సాయిబాబా, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ..



ఏడిద సంఘం పుంత రోడ్డు వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట ఏడిద సంఘంపుంత రోడ్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని ఎమ్మెల్సీ వివరిస్తూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ. రాజు, పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజుతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అనంతరం ఏడిద ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఏఎంసీ కె. ఏసుబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, మండల ఆర్‌బీకే కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, తాతపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు



కోరుమిల్లిలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న పృథ్వీ, ప్రజాప్రతినిధులు



కూర్మాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

కపిలేశ్వరపురం: జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ యువ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ మంగళవారం కోరుమిల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు ఆచంట వీరవెంకట స్వామి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు తదితరులతో కలసి వారు ఇంటింటి పర్యటన చేశారు. సచివాలయ కన్వీనర్లు పల్లి శ్యామల, పేరాబత్తుల రామకృష్ణలతో కలిసి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందిన మేలు గురించి వివరించారు.

రాయవరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం మండలంలోని కూర్మాపురంలో నిర్వహించారు. అవినీతికి తావు లేకుండా, సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని సర్పంచ్ చౌటుపల్లి చక్రవేణి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పరంశెట్టి వెంకటరమణ మూర్తి, నేతలు తవిటికి రత్నకుమార్, మందపల్లి చిన్నోడు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ సమ్మాన్ సేవింగ్స్‌తో ఆర్థిక భద్రత



ఖాతాదారులకు పాస్‌బుక్‌లు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: తపాల శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీం స్త్రీలకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మహిళ సమ్మాన్ సర్టిఫికెట్ స్కీం పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఘనంగా జరిగింది. చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ స్కీంను మహిళలు, వారి సంరక్షణలోని బాలికలు కూడా ఓపెన్ చేయవచ్చన్నారు. అకౌంట్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందన్నారు. రూ.1000 నుంచి రూ.2000 వరకూ డిపాజిట్ చేసుకోవచ్చునని, డిపాజిట్ సొమ్ముపై 7.5 శాతం వడ్డీ లభిస్తుందని సూర్యనారాయణ వివరించారు. అనంతరం అకౌంట్ ఓపెన్ చేసిన మహిళలకు చైర్‌పర్సన్ దుర్గారాణి పాస్‌బుక్‌లు అందజేశారు. పోస్టుమాస్టర్ ఎన్. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కల్యాణి, జొన్నపల్లి విజయలక్ష్మి, బొక్కా సరస్వతి, నీలం దుర్గ, మొండి భవాని, బీజేపీ నేత కోన సత్యనారాయణ, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టి. పుల్లేశ్వరరావు, కేవీ నారాయణరావు, కె జానకి, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నివారణ చర్యలపై అవగాహన అవసరం



గ్యాస్ గొడౌన్ వద్ద కార్మికులకు సూచనలు చేస్తున్న అగ్నిమాపకాధికారి నాగేశ్వరరావు తదితర సిబ్బంది

రామచంద్రపురం: అగ్నిప్రమాదం జరిగినప్పుడు నివారణ చర్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రామచంద్రపురం అగ్నిమాపకాధికారి ఎస్. నాగేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పెట్రోల్, గ్యాస్ గొడౌన్ ఆర్టోస్ బేవరేజెస్ కంపెనీల వద్ద పనిచేసే కార్మికులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందికి అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం ద్రాక్షారామకు నూతన రూపురేఖలు

మంత్రి వేణు



ద్రాక్షారామ డంపింగ్ యార్డు వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ఆధ్యాత్మిక క్షేత్రం ద్రాక్షారామను మరింత అభివృద్ధి చేసి నూతన రూపురేఖలు సంతరించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం మంత్రి వేణు విస్తృతంగా పర్యటించారు. భీమేశ్వరాలయానికి ఈశాన్యంగా సుదీర్ఘ కాలంగా ఉన్న డంపింగ్ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యంను ఆదేశించారు. చెత్తతో నిండిపోయి రోడ్డు మీదుకు వస్తున్న చెత్తను తరలించేలా సూచనలు చేశారు. అదే విధంగా భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్తగోదావరిని ఆధునీకరించి ఆలయానికి వచ్చే భక్తులకు పవిత్రమైన అనుభూతిని అందించే విధంగా స్వచ్ఛమైన నీటితో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ద్రాక్షారామలో కూరగాయల మార్కెట్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, డేగల వెంకటరమణ, నాయకులు నక్కా నాగు, బ్రహ్మజీ, కర్రి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పనితీరుపై సమీక్ష



పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పనితీరుపై సమీక్షిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పనితీరుపై డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు మంగళవారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారులు అంగన్‌వాడీ స్కూళ్లను సందర్శించి చిన్నారుల ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శించేటప్పుడు 14 రకాల మెడికల్ ల్యాబ్ పరీక్షలను అందుబాటులో ఉంచుకుని సేవలు అందించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబడుతున్న పీహెచ్‌సీల వైద్యాధికారులను కారణాలను అడిగి తెలుసుకుని పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులను సకాలంలో గుర్తించి సేవలు అందించాలన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు వెంటనే జీరో డోస్ వ్యాక్సిన్ వేసే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ వైద్యాధికారి డాక్టర్ కె.శివరంజని, డివిజన్ సూపర్‌వైజర్ కె.గోవిందబాబు, డివిజన్ పరిధిలోని మండలాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పీఠంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు పూజలు



పీఠాధిపతి గాడ్‌ను సత్కరిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని ఏపీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మంగళవారం సందర్శించారు. ఆయన పీఠంలో విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్‌తో కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడారు. పీఠాధిపతి గాడ్‌ను రుద్రరాజు సత్కరించారు. పీఠంతో తనకున్న అనుబంధాన్ని పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) ఆధ్వర్యంలో రుద్రరాజును దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

మార్కెట్‌లో పాడైపోయిన మేక మాంసం

సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



షాప్‌ను సీజ్ చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

మండపేట: స్థానిక మున్సిపల్ మార్కెట్‌లో మాంసం విక్రయాల్లో నాణ్యత కొరవడింది. చనిపోయిన, వ్యాధిగ్రస్త మేకలను వధించి మార్కెట్‌లో విక్రయించడం పరిపాటిగా మారింది. మంగళవారం రెండు చనిపోయిన మేకలను తీసుకు వచ్చి అమ్మకాలు చేస్తున్నట్టు అందిన సమాచారంతో మున్సిపల్ అధికారులు దాడిచేసి షాప్‌ను సీజ్ చేశారు.

సాధారణంగా మేకలు, గొర్రెలకు వెటర్నరీ వైద్యులు యాంటీ మార్టమ్ ఎగ్జామినేషన్ చేసి ఆరోగ్యవంతంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం వాటిని వధించాలి. చిన్నవి, వ్యాధులతో బాధపడుతున్నవి, గర్భంతో ఉన్నవాటిని, చనిపోయిన వాటి మాంసం అమ్మకాలు చేయకూడదు. కాగా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వ్యాపారులు చనిపోయినవి, వ్యాధిగ్రస్త మేకలను వధించి వాటి మాంసాన్ని మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందంటున్నారు. మంగళవారం మున్సిపల్ మార్కెట్‌లో రెండు చనిపోయిన మేకలను వధించి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య సిబ్బందితో దాడి చేశారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని దుకాణాన్ని సీజ్ చేశారు. కాగా అప్పటికే చాలా వరకూ మాంసం అమ్మకాలు జరిగినట్టు తెలుస్తోంది. వ్యాధిగ్రస్త మేకల మాంసం తినడం వలన ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందంటున్నారు.

ప్రజల సౌకర్యార్థమే ఆధార్ శిబిరాలు

రాయవరం: సేవలను ప్రజలకు దగ్గర చేసేందుకే ప్రభుత్వం ఆధార్ సెంటర్లను సచివాలయాల్లో ఏర్పాటు చేసిందని ఎంపీడీవో డి.శ్రీనివాసు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసు మాట్లాడుతూ ఈ నెల 27 వరకు చెల్లూరు-3, పసలపూడి-2, సోమేశ్వరం-1, కూర్మాపురం, కురకాళ్లపల్లి, వెంటూరు-1లలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు బాల ఆధార్ క్యాంపులపై అవగాహన కల్పించామన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు



పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కిట్లు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

మండపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు 200 మంది పేద ముస్లిం మహిళలకు మంగళవారం రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ షేక్ మౌలానా, వైస్ చైర్మన్ షేక్ ఇబ్రహీం, మేనేజింగ్ ట్రస్టీ అతిఖ్ తదితరులు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మౌలానా మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టీలు ఎస్‌కే చిన్నబాదుల్లా, ఎస్‌కే మౌలాలి, ఎస్‌కే బాషా, ఎస్‌కే రబ్బానీ, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తుప్పలతో తిప్పలు



కోట రోడ్డులో ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్యవరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ తుప్పలు ఏటిగట్టుకు ఇరువైపులా ఉన్నాయని గత రెండు నెలల క్రితం తుప్పలను తొలగించి మళ్లీ ఎదిగిపోయాయని పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ఉనికి కాపాడుకునేందుకు దుష్ప్రచారం

ఎమ్మెల్యే వేగుళ్లపై వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

మండపేట: బలహీన వర్గాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఉన్న జనాదరణను చూసి ఓర్వలేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండలంలోని ఏడిదకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కుల, మత విద్వేషాలు సృష్టించాలని చూస్తున్నారని మండి పడ్డారు. ఏడిదలో మంగళవారం సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, బీసీ నేత కుడిపూడి రాంబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఇటీవల వెదురుమూడిలో పూలే విగ్రహ వివాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూశారని, అయితే ఎమ్మెల్సీ తోట వారి ఆటలు సాగనీయలేదన్నారు. మండపేట మున్సిపాల్టీ చరిత్రలో వైస్ చైర్మన్ పదవిని తొలిసారిగా శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇచ్చిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. ఏడిద గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వేగుళ్ల చేసిందేమీ లేదని, ఎమ్మెల్సీ తోట హయాంలో గ్రామాభివృద్ధి జరుగుతోందన్నారు. సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు తాతపూడి ఉష, పార్టీ నాయకులు చంద్రమళ్ల బులివీరయ్య, కుడిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ఇఫ్తార్ విందు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో షాబాజియా మసీదులో బడీరాత్(జాగారం) పురస్కరించుకుని మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు పెద్ద గులూస్ రాజా ఆలం, మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఫాజిల్ అజారుద్దీన్, సెక్రటరీ బాబూలాల్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దౌర్జన్యంపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటలో ఎల్లారాంబిక జాతరలో తనపై ఐదుగురు దౌర్జన్యం చేశారని కమిటీ సభ్యుడు మంగా కోటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15న అమ్మవారి జాతర నిర్వహించుకునేందుకు పోలీసులు అర్ధరాత్రి 12 వరకు అనుమతి ఇచ్చారు. అయితే సమయం దాటినా సంబరం కొనసాగించాలని చల్లా వెంకన్న, బద్రి భీమశంకరం, పెమ్మిరెడ్డి భీమశంకరం, బద్రి సూరిబాబు, బందారు బాబు, శిరెళ్ల అనిల్‌కుమార్‌లు తనపై దౌర్జన్యం చేశారని మంగా కోటేశ్వరరావు ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శభాష్‌పేటలో ఐదుగురు తనపై దాడి చేశారని జి.హరిప్రసాద్ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 11న అంబేడ్కర్ విగ్రహం కోసం తయారు చేయించిన రెయిలింగ్ విషయంలో వివరాలు అడిగినందుకు తనపై వినకోటి కుమార్, గుంటూరు ప్రతాప్, బుర్రా శివ, నక్కా నాగులు, దుర్గబాబు, చెల్లే శ్రీనివాస్‌లు దాడి చేసి గాయపరిచారని హరిప్రసాద్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.